క్లుప్తంగా

36 మందికి కళ్లజోళ్లు పంపిణీ



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3 కార్యక్రమంలో భాగంగా అవ్వాతాతలకు నేత్ర వైద్యాధికారి ఆర్ఎల్‌వీ చంద్రశేఖర్ పరీక్షలు నిర్వహించారు. జూలై 13వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సహకారంతో ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పెదకాకాని శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు చేసిన విషయం తెలిసిందే. వారిలో 36 మందికి శుక్లాల ఆపరేషన్ చేశారు. వారందరికీ డాక్టర్ చంద్రశేఖర్ నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ కృష్ణారావు

హనుమంతునిపాడు: ఇళ్ల నిర్మాణాలు పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేట్లు చూడాలని ఏఓ క్రిష్ణారావు ఇంజినీర్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 531 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 259 ఇళ్లను లబ్ధిదారులు ప్రారంభించగా 35 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన లబ్ధిదారులతో పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. బిల్లులు జాప్యం జరగకుండా లబ్ధిదారులకు అందేట్లు చూడాలని సూచించారు. హౌసింగ్ ఏఈ కొండయ్య, ఇంజినీర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, అంకితభావంతో పనిచేస్తే వృత్తిలో తగిన గుర్తింపు పొందుతారని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రెండవ ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని పెదగోగులపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీపై వేరేపాఠశాలలకు వెళ్లిన బి.శివప్రసాదాచారి, జి.రవీంద్రనారాయణలను బుధవారం పాఠశాల హెచ్ఎం కె.సుబహాన్‌బీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శివప్రసాదాచారి, రవీంద్రనారాయణల కృషి కొనియాడదగినదన్నారు. ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి, ఉపాధ్యాయులు షేక్.నాయబ్ రసూల్, జె.యస్.ఆనంద్‌బాబు, రఫి, నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధరల స్థిరీకరణ నిధి సమావేశం

కందుకూరు: కందుకూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో పండించే పంటలు వాటి మద్దతు ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసాలను చర్చించేందుకు ధరల స్థిరీకరణ నిధి సమావేశం గురువారం సాయంత్రం 4గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జరుగుతుందని ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి వ్యవసాయశాఖతో పాటు, అనుబంధ శాఖల అధికారులు తగిన సమాచారంతో రావాలని సూచించారు. అలాగే రైతులు, వ్యాపారులు హాజరుకావాలని కోరారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ

లింగసముద్రం: రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ అండర్–17 బాలికల విభాగంలో మండలంలోని పెదపవనిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత తెలిపారు. పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.సిరిగంగ, ఎ.యమున, జి.పూజిత ఈ నెల 12, 13వ తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం

- ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్
- సంక్షేమ పథకాల ప్రచారంలో జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు కీలకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: సంక్షేమ పథకాల ప్రచారంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహ సారథులు పాత్ర కీలకమని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు సమావేశం బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగుతుందన్నారు. జగనన్నే మా భవిష్యత్, జగనన్న సురక్ష, వంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జేసీఎస్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లు, గృహ సారథులు చేసిన కృషిని కొనియాడారు. మరింత సమన్వయంగా పనిచేసినప్పుడే రానున్న ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండాను తిరిగి ఎగురవేసి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేయడమే మన లక్ష్యంగా పిలుపునిచ్చారు. సచివాలయ కన్వీనర్లు, జేఏసీ ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు, నాయకులు ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రతి సచివాలయంలో గృహ సారధుథు, వలంటీర్లతో ఈ నెల 18 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ లోగా అన్ని సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మొత్తం 105 సచివాలయాల్లో 295 మంది కన్వీనర్లు హాజరు కావడాన్ని కొనియాడారు. జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులకు కల్పించే జీవిత బీమా సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జేసీఎస్ ఇన్‌చార్జిలు వేల్పుల వెంకటేశ్వర్లు, సుదర్శన్, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మద్ది తిరుపతయ్య, పోల్లా సుబ్రహ్మణ్యం, ఎస్‌కే ఖాదర్ బాషా, కన్వీనర్లు జి.బ్రహ్మారెడ్డి, ఓకేరెడ్డి, తమ్మినేని సుజాత, సిద్దారెడ్డి, శ్రీహరిరెడ్డి, పెన్నా వెంకటేశ్వర్లు, సంగు సుబ్బారెడ్డి, బైరెడ్డి జయరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్లు సత్యవతి, శ్రీరాం సతీష్, దేవరాజ్, రామనబోయిన శ్రీను, పెన్నా ఏడుకొండలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పాల్గొన్న జేసీఎస్ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, గృహసారథులు

వైఎస్సార్ సీపీ మద్దతుదారును గెలిపించండి



పాకలలో ఓట్లు అభ్యర్థిస్తున్న వరికూటి అశోక్‌బాబు

- ప్రజలకు వరికూటి అశోక్‌బాబు విజ్ఞప్తి
- పాకలలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

సింగరాయకొండ: పాకల సర్పంచ్ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు కుర్రు ప్రసన్నకుమార్‌ను గెలిపించాలని ఆ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు విజ్ఞప్తి చేశారు. బుధవారం పాకల గ్రామంలో ఉప ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. వరికూటి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారు కుర్రు ప్రసన్నకుమార్‌ను కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పాకల అభివృద్ధికి ఈ ప్రభుత్వంలో చేసిన కృషిని ప్రజలకు వివరించారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు వరికూటి ప్రచారం నిర్వహించారు. గురువారం కూడా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తానని పార్టీ మద్దతుదారు గెలుపే తమ ధ్యేయమన్నారు. వైస్ ఎంపీపీ రవికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు గోళ్లమూడి అశోక్‌కుమార్‌రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, కె.కృష్ణారెడ్డి, పాలెపు మాధవరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు బుజ్జమ్మ, తాతయ్య, డి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ 16వ వార్డులో..

సింగరాయకొండ 16వ వార్డు ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతుదారు షేక్ సాబీరాకు మద్దతుగా బుధవారం ఆ పార్టీ నాయకులు ఓట్లు అభ్యర్థించారు. పార్టీ నేతలు తాటిపర్తి చంద్రశేఖర్, షేక్ బషీరాబేగం, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, సవళం కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’తో మెరుగైన వైద్యం



పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి ఇంటికి వెళ్లి సూచనలిస్తున్న డాక్టర్ సరస్వతి

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు అందుతున్నాయని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సరస్వతి పేర్కొన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు 12 మంది, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న 64 మందికి వైద్య పరీక్షలు చేశారు. సుఖ ప్రసవం అయ్యేందుకు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను గర్భిణులకు వివరించారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీనివాసరావు గత మూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతుండగా డాక్టర్ సరస్వతి ఆయన ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం గంగాభవాని, రూత్ పాల్గొన్నారు.

21లోగా ఓటరు సర్వే పూర్తి చేయాలి



సింగరాయకొండలో బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: ఈ నెల 21వ తేదీనాటికి నూరు శాతం ఓటరు సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ సీహెచ్ ఉష స్పష్టం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఓటరు సర్వేపై బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో ఓటరు సర్వే ఇప్పటి వరకు 85 శాతం పూర్తయిందన్నారు. ఎన్నికల సర్వేలో అవకతవలు లేకుండా జాగ్రత్త వహించాలని, ఒక కుటుంబం ఒక పోలింగ్ బూత్‌లో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని, ప్రతి ఓటరుకు ఇంటి నంబరు తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు, సర్వేయర్ బ్రహ్మం, ఎన్నికల సిబ్బంది అశోక్, జూనియర్ అసిస్టెంట్ శివ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో అధిక దిగుబడి



టంగుటూరులో పొగాకు వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు రైతులు పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేసి భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనధికారికంగా పొగాకు సాగు చేయడం, బ్యార్నీలు నిర్మించడం , ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలను చూసి బ్యార్నీ, భూమి కౌలుకు తీసుకోవడం లాంటివి చేయవద్దని చెప్పారు. వచ్చే సీజన్‌లో ఇదే ధరలు కొనసాగకపోవచ్చన్నారు. కాగా, పొందూరు క్లస్టర్ రైతులు 1322 బేళ్లను వేలానికి ఉంచగా 1267 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.278, కనిష్ట ధర రూ. 160, సరాసరి ధర రూ.262.67 పలికింది. వేలంలో మొత్తం 38 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

దేశాభివృద్ధికి వాజ్‌పేయి సేవలు ఎనలేనివి



పామూరులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పామూరు: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి 5వ వర్ధంతిని బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడై, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి రమణయ్యతో పాటు పలువురు బీజేపీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గొప్ప పాలనా దక్షత ఉన్న వ్యక్తి మాజీ ప్రధాని వాజ్‌పేయి అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అనంతరం పట్టణంలోని వైద్యశాలల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీచేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాజం చినసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ సుబ్బారావు, పందిటి శ్రీనివాసులు, దేవిశెట్టి పవన్‌కుమార్, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



దేవస్థాన భూములు పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

పామూరు: దేవాదాయ, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని తహసీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. స్థానిక నెల్లూరురోడ్డు, విరువూరురోడ్డుతో పాటు పలుప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన దేవస్థాన భూములను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా సర్వేనంబర్ 256లో 29.33 ఎకరాలు, 257లో 1.06 ఎకరాలు, 322లో 0.56 ఎకరాలు, 329లో 2.41 ఎకరాలు, 442/1,2,3లో 7.68 ఎకరాలు, 365/ 2,3 లో 4.29 ఎకరాల భూములను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ, దేవస్థాన భూములను ఆక్రమించడం నేరమని, ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ మల్లికార్జున, మండల సర్వేయర్ స్నేహ, వేణుగోపాలస్వామి దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుడు పసుపులేటి రఘురాం, వీఆర్‌ఓలు షేక్.రఫీ అహ్మద్, షేక్ ఖాజారఫీ ఉన్నారు.

2738 బేళ్ల విక్రయం

కందుకూరు: పొగాకు వేలం ముగింపు దశకు చేరుకోవడంతో పొగాకు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేల సంఖ్యలో ప్రతిరోజు బేళ్లను అధికారులు విక్రయిస్తున్నారు. బుధవారం కందుకూరు రెండు వేలం కేంద్రాల పరిధిలో జరిగిన వేలంలో 2738 బేళ్లను అధికారులు విక్రయించారు. వీటిలో కందుకూరు–1వ పొగాకు వేలం కేంద్రంలో 1543 బేళ్లను వేలానికి ఉంచగా 1461 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 1355 బేళ్లు వేలానికి ఉంచగా 1277 బేళ్లు విక్రయించారు. కేజీ పొగాకు అత్యధిక ధరలు వరుసగా రూ.274, రూ.271 వచ్చాయి. అత్యల్ప ధర రూ.160గా నమోదైంది.

వైభవంగా కాలభైరవస్వామికి పూజలు



కాలభైరవస్వామి పూజలు చేస్తున్న అర్చకుడు

జరుగుమల్లి: మండలంలోని కె.బిట్రగుంటలో కాలభైరవస్వామి దేవస్థానంలో బుధవారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు గూడల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు గుమ్మడి కాయలపై దీపాలు వెలిగించి పూజలు చేయడంతోపాటు ప్రత్యేక హోమాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఇన్‌చార్జి బి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానిస్తున్న మండల పరిషత్, సచివాలయ ఉద్యోగులు

వెలిగండ్ల: ఉత్తమ ఈఓఅండ్‌పీఈఆర్‌డీగా ప్రశంసా పత్రం అందుకున్న ఎంపీడీఓ టి.కుమార్‌ను స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో మండల పరిషత్, సచివాలయ ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. వరుసగా రెండుసార్లు ఉత్తమ ఈఓపీఈఆర్‌డీగా ఎంపిక కావడం అభినందనీయమని ఉద్యోగులు కొనియాడారు. దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఏఓ మహబూబ్ బాషా, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, సచివాలయ ఉద్యోగులు షకీల, పద్మ, పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న హెచ్ఎం భారతి తదితరులు

కొండపి: ఉత్తమ పురస్కారం అందుకున్న వెన్నూరు హైస్కూల్ టీచర్ హనుమంతరావును హెచ్ఎం డి.భారతి, సహోద్యోగులు అభినందించారు. బుధవారం వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించండి

- గుంటూరు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు



హెచ్ఎంలతో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

సింగరాయకొండ: విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించడంతోపాటు మనబడి నాడు–నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని గుంటూరు ఆర్జేడీ, ఇన్‌చార్జి డీఈఓ వీఎస్ సుబ్బారావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల నాడు–నేడు పనుల కోసం కొన్ని పాఠశాలలకు నిధులు విడుదలయ్యాయని, వేగంగా పూర్తి చేసేందుకు హెచ్ఎంలు కృషి చేయాలన్నారు. డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే ఉపాధ్యాయుల ట్రైనింగ్ సెంటర్‌కు అవసరమైన వసతులు కల్పించేందుకు మలినేని సుశీలమ్మ ఇంజినీరింగ్ కాలేజీని పరిశీలించారు. ఎంఈఓలు బి.శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాన్ని స్మరించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, నాయకులు

కనిగిరి రూరల్: మాతృభూమి కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం కోల్పోయిన అమరవీరులు, త్యాగధనుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆజాదీ కా అమృత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నా భూమి–నా దేశం, అమరవీరుల స్థూపాన్ని బుధవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా, నేల తల్లి స్వేచ్ఛగా జీవించేందుకు అవకాశం కల్పించిన దేశాన్ని గౌరవించుకునేలా ఏర్పాటు చేసిన కార్యక్రమంగా తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఎంపీపీ ప్రకాశం, చింతగుంట్ల సాల్మన్‌రాజు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, వైస్ ఎంపీపీ జి.ధనుంజయ్, పార్టీ పట్టణ మండల అధ్యక్షులు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, తమ్మినేని సుజాత, దేవకి సత్యావతి, ఖాజా, అబ్రహం లింకన్, దేవరాజ్, బొట్టు శ్రీను, దాసరి మురళీ, పెన్నా ఏడుకొండలు, రామనబోయిన శ్రీను, జానీ, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, అరుణోదర్, డాక్టర్ రసూల్, మీరావలి, సీహెచ్ కిషోర్, నాగూర్‌బీ, భారతి, తిరుపతయ్య, మన్సూర్, ప్యారీజాన్, మున్నా, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు. తొలుత బాబు జగజ్జీవన్ రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



వార్డులో పర్యటి స్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 15వ వార్డు, రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు అబ్రహం లింకన్, ఏఈ కోటేశ్వరరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు. బాల్య వివాహాల రహిత భారత దేశం మన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సౌజన్యంతో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఎస్‌బీసీ సిసెల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలను నిషేధిద్దాం, బాల హక్కులను కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళా సాధికారత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: మహిళా సాధికారత, స్త్రీ సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే, ఎన్జీరంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్ ఆవరణలో బుధవారం మహిళలు– మహారాణులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలనే ఉన్నత లక్ష్యంతో మంత్రి పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో, కార్పొరేషన్ పదవుల్లో సముచిత స్థానం కల్పించారని గుర్తు చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం పథకం ద్వార అనేక మహిళలకు రుణాలు, ఆర్థిక చేయూతను ప్రభుత్వం అందచేస్తున్నట్లు వివరించారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యం కల్పించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే నన్నారు. పార్టీల కతీతంగా సంక్షేమ ఫలాలను అందచేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనన్నారు. ప్రభుత్వం మహిళా సంక్షేమానికి, రక్షణకు చేపడతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, దేవకి సత్యావతి, ప్యారీజాన్, ఎంపీటీసీ పాపాన బోయిన కోటమ్మ, లక్ష్మీ, వేసపోగు దేవమ్మ, జీ మరియమ్మ, పరిసపోగు రాధ , పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సంగు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.